# జోరీగ

రావిపల్లి నారాయణరావు

**'కమర్షియల్ మీటింగ్ సంగతి. జ్ఞాపకం ఉందా శ్రీపతీ! రేపు పది గంటలకు నువ్వు ప్రిపేర్ చేసే నోట్ నా టేబుల్ పైన ఉండాలి' ఆఫీసు నుంచి ఇంటికెళ్తూ డైరక్టర్ రిమైండ్ చేశారు. సాయంత్రం ఏడు వరకు ఆఫీసులోనే కూర్చున్నా. కాని నోట్ కంప్లీట్ కాలేదు. ఇంట్లో స్టడీగా ఒక గంట కూచుంటే పూర్తికా కపోతుందా అని ముఖ్యమైన ఫైల్సు పుచ్చుకుని ఇంటి కెళ్ళాను. శ్రీమతి పడుకుని ఉంది. లైట్లన్నీ ఆఫ్ చేసి ఉన్నాయి. గదిలో అడుగు పెట్టగానే అమృతాంజనం వాసన గుప్పు మంది. ఇది తలనొప్పి ప్రభావమే అయి ఉండోచ్చని అనుకు న్నాను. ఆమెకిలాగే వారానికో రెండు వారాలకో ఒకసారి వస్తుంది తలనొప్పి. ఇఎన్‌టీ స్పెషలిస్టు దగ్గరకు తీసుకెళ్ళడం, అతను మందులివ్వటం- ఇది మామ్మూలే.**

డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని నోట్ తయారుచేసే పని ప్రారంభించాను. కాని నోట్ ఒక ఆర్డర్లో రాలేదు. మళ్ళీ మొదట్నించి రాయాల్సి వచ్చింది. మూడొంతులు కంప్లీటయేసరికి టైమ్ పదిన్నరైంది. మిగిలినది ఉదయం లేవగానే పూర్తి చేయలేక పోతానా అన్న ధైర్యం వచ్చింది.

మంచం మీద పడుకుని ఉన్న శ్రీమతి నీరజకు ఒక కప్పు వేడి పాలిచ్చి, హాట్ పేక్‌లో ఉన్న నాలుగు బ్రెడ్ ముక్కలు తిని ఆకలి తీర్చుకున్నాను నేను. తలుపులన్నీ వేసి నిద్ర పోదామని బెడ్‌రూమ్‌లోకి వెళ్ళబోయాను. నానిగాడి దగ్గర నుంచి ఫోను. కార్డ్‌లెస్ తీసుకుని మాట్లాడాను. నానిగాడంటే మా ఏకైక పుత్రుడు. బెంగ ళూరు సమీపంలో ఒక రెసిడెన్షియల్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. ఎగ్జా మినేషన్ ఫీజు కట్టాలట. అర్జంటుగా డబ్బు పంపమని చెప్పాడు. నోట్ ప్రిపరేషన్ హడావుడిలో రేపు వాడికి డబ్బు పంపే సంగతి మరిచిపోకూడదని మనసులో అనుకున్నాను. అన్నట్టు రేపు సాయంత్రం లోపున నీరజకు మరోసారి చెకప్‌కు స్పెషలిస్టు దగ్గరకు తీసుకెళ్ళాలి. -ఇరవైనాలుగు గంటలూ మీ మీటింగ్‌లు, బిజి నెస్ వ్యవహారాలు తప్ప నా ఆరోగ్యం గురించి పట్టించుకోరని నీరజ నాలుగు దినాల నుంచి నా ప్రాణాలు తోడేస్తుంది. చేతిలో ఉన్న కార్డ్‌లెస్ ఫోను యధాస్థా నంలో పెట్టి మంచం మీద పడుకున్నాను. నాలో ప్రత్యేకమైన ఒక లక్షణం ఉంది. రాత్రి ఎంత ఆలస్యమైనా పనిచేస్తూ బిజీగా ఉన్నంత వరకు నిద్ర నా జోలికి రాదు. తీరుబడిగా ఉన్నప్పుడు రిలాక్స్ అవుదామని మంచం మీద నడుం వాల్చిన మరు క్షణమే గట్టు తెగిన ప్రవాహంలా ముంచుకొస్తుంది నిద్ర. ఎప్పుడు నిద్రలోకి జారు కున్నానో నాకు ఎఱుకలేదు.

బెల్ నిర్విరామంగా మోగుతోంది. గణ గణమంటూ డిస్టర్బ్ చేస్తున్న బెల్ శబ్దా నికి నా కళ్ళు తెరచుకున్నాయి. కాని నేను మంచం దిగలేదు. మళ్ళీ బెల్‌మోత ప్రశాంతంగా ఉండనీయటం లేదు... ఒక్కొక్కప్పుడు అనిపిస్తుంది- అపార్ట్‌మెం ట్‌కి కాలింగ్ బెల్ అంత అవసరమా అని. దాని వల్ల కలిగే సుఖంకన్నా వచ్చే తల నొప్పి ఎక్కువని కొన్నాళ్ళకింద బెల్ తీయించేశాను. అప్పుడు మరో రకమైన సమస్య ఎదురైంది. వచ్చిన అతిథులు తలుపు బాదటం మొదలుపెట్టారు. అదీ భరించటం సాధ్యం కాలేదు. మళ్ళీ బెల్ ఫిక్స్ చేయించక తప్పలేదు.

బెల్ నాన్‌స్టాప్‌గా మోగటంతో అంతవరకు మంచంమీద దొర్లుతూ ఉన్న నేను బద్ధకంగా లేచి తలుపుతెరిచాను. ఒక అపరిచిత వ్యక్తి వరండాలో నిలబడిఉన్నాడు. ఇంతకుముందు అతన్ని ఎక్కడా చూసినట్టులేదు... పొడవైన విగ్రహం, అంతకు తగ్గ శరీరం, నల్లగా గుబురుగా ఉన్న మీసాలు, వికృతంగా కనిపించే ఎత్తైన దంతాలు- చూడగానే ఎవరీ పెద్దాయన అనిపించినా అతని వయసు ముప్పై నలభై మధ్యనే ఉంటుంది. తలుపు తీయగానే నన్నుచూసి అతను నవ్వాడు. ఆ నవ్వులో ఆప్యాయతకన్నా ఎగతాళి కొట్టొచ్చినట్టు కనిపించింది.

'ఏంది శ్రీపతీ... నీపేరు శ్రీపతే గదూ!' అతను నవ్వాడు- దంతాలన్నీ ఒక్క సారే దర్శనానికి నోచుకున్నట్టు.

'అవును' అన్నాను కళ్ళు నలుపుకుంటూ.

'అవును గదూ... ఏందీ, ఇంకా కునుకు తీస్తూనే ఉన్నావు గదూ... ఇప్పుడు టైమెంతయిందో...'

'ఎంతయింది?' అడిగాను.

'ఎనిమిది ఎప్పుడో దాటింది గదూ...'

'ఇంతకీ మీరెవరు?'

'ఓరి నీ బండబడా- కాంప్లెక్స్‌లో కూచున్న నీకే నాపేరు ఎరుకనేకపోతే ఇక ఊళ్లో జనాలు ఎట్టాసెప్పగలరూ అంటా... అవును గదూ శ్రీపతే... ఇప్పడైనా ఇనుకో శ్రీపతే. మనపేరు జోగినాథం... మనపెల్లాం ఉందిగదూ... దానిపేరు సీతారత్నం. మాకో కొడుకు... ఆడే రాంపండు. వొక్కడే గదూ అందుకు ముద్దుగా పెట్టా ఆపేరు. ఈ కాంపెక్స్‌లో నేను దిగి పదిదినాలైంది శ్రీపతీ- మరేందీ ఈడ నన్ను ఒక్కడూ పట్టించుకోనంటాడు- తమాసాగా నేదూ!...'

జోగినాథం మాటలకు ఫుల్‌స్టాప్ లేదు. అతని మాటలు కొన్ని అర్థమై చావ టంలేదు. నా ధ్యాసంతా పూర్తిచేయవలసిన ఆఫీస్ నోట్‌మీదే ఉంది.

'చూడండీ జోగినాథంగారూ! ఈ కాంప్లెక్స్‌కు ఒక కమిటీ ఉంది. దానికి ఒక ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరరు ఉన్నారు' నా మాటలు జోగినాథం వినిపించుకునే మూడ్‌లో లేడు.

అదేం మాట శ్రీపతే- ఈ అపార్ట్‌మెంట్ నీదే గదూ...'

'అవును- నాదే...'

'అందుకే గదూ నేను నెత్తి బాదుకునేది. నువ్వేమి పట్టించుకోలే దని మొత్తుకునేది... ఈ మిద్దెమీదెవరు?- ఈ మిద్దెకిందెవరు??... పక్కలో ఎవడు... వచ్చినోడెవరు? పోయినోడెవరు?- కాంప్లెక్స్‌లో ఎవడూ పట్టించుకోడు గందా... తమాసాగా నేదూ!...'



వీడెవడండీ బాబూ...తలకేస్తే మొలకేస్తాడు, మొలకేస్తే తలకే స్తాడు. వీడు ఇప్పట్లో వదిలే టట్టులేడు. టైమ్ చూస్తే వాయువేగాన పరుగెడుతున్నట్టుంది. వీడెప్పుడు కదులుతాడో... నా నోటు ఎప్పుడు కంప్లీటు అవుతుందో... దేవుడా నువ్వే రక్షించాలి.

'ఇదిగో శ్రీపతే- నాపేరు జోగినాథం, నేనప్పుడే సెప్పాను గదూ!' చెప్పాడు జోగినాథం.

'అవును చెప్పారు'

'నీబండ బడా- పేరు ఎరుకే గదూ... నేనీడకొచ్చాగదూ, ఎందుకో...'

'మీరింకా చెప్పలేదు'

'బలే బలే తప్పు నామీదే ఏసావ్‌గదూ నీబండ బడా... సెబుతున్నా ఇనుకో శ్రీపతే. మీ ఇంటావిడనేదూ నిన్న నీల్లు సిమ్మి, ముగ్గేసింది గదూ..' నామొహం లోకి చూశాడు జోగినాథం.

'నా భార్యా!... ఆమె నీళ్ళు చిమ్మదు, ముగ్గేయదు. -ఆ పని మా ఇంటి పనిమ నిషి చేస్తుంది'

'సర్లేవోయ్- ఆ ఇసయం మాకూ తెల్సు. మీ పనిమనిసే- నీల్లు సిమ్మింది. మరి తడిగుడ్డతో తుడిసిందా, నీల్లన్నీ మా వరండాలోకి వగ్గేసింది'

'మీ వరండాలోకి వదిలేసిందా?' నేను కాస్త కోపంగా అడిగాను.

'ఏంది శ్రీపతే గట్టిగా అరుస్తావు. మా వరండాలోకి వగ్గేసింది... అదే గదూ నా బాధ'

'అవును మీరుండేది ఏ ఫ్లోరు?'

'అయిదో ఫ్లోరు గదూ...'

'ఈ ఫ్లోరు- ఇప్పుడు మనం నిలబడి ఉన్న ఫ్లోరు ఏ ఫోర్లంటారు?'

'నువ్వుండే ఫ్లోర్ నంబరు సెప్పాల్సింది నవ్వు గదూ... నన్నడుగుతావేందీ, తమాసాగా నేదూ...'

'నేనున్నది తర్డ్‌ఫ్లోరు. మూడో ఫ్లోర్‌లోని నీళ్ళు అయిదో ఫ్లోర్లోకి ఎలా వెళ్తాయి?'

'నిజమే గదూ శ్రీపతే- ఎలా వెల్తాయి? అంత తెలివి తక్కువ దద్దమ్మగా నేను... కాదు గదూ! అదే... అదే... ఆరోఫ్లోర్ కెల్లబోయి మూడో ఫ్లోరుకొచ్చిపడ్డానా? తమాసాగానేదూ!... శ్రీపతే నాకు తెలీక అడుగుతాను- ఈ కాంప్లెక్స్ లిఫ్టుంది గదూ- అది చాలా సిత్రంగా నేదూ... ఆ బోర్డులో కిందో సిచ్చి మీదో సిచ్చి ఉంది గదూ... దాని బండ బడా మీద్దినొక్కితే కిందికీ, కిందిది నొక్కితే మీదికి పరిగెత్తుతుంది గదూ ఈ లిఫ్టు... తమాసాగా నేదూ...' ఫకాలున నవ్వాడు జోగినాథం. ఎదుటి ఫ్లాటునుండి అప్పుడే బయటకొచ్చిన మూడేళ్ళ పాప ఆ నవ్వుకి జడుసుకుందేమో ఏడుపులంకించుకుని లోనకు పరుగెత్తింది.

'జోగినాథంగారూ, మీరేమి చెబుతున్నారో నాకు అర్థం కాలేదు కాని- స్విచ్ బోర్డు లిఫ్టులో ఉంది. తర్డ్ ఫ్లోర్ కెల్లాలంటే మూడో నెంబర్ మీదా సెకెండ్ ఫ్లోర్ కెళ్ళాలంటే రెండో నెంబరు మీద గట్టిగా ప్రెస్ చేయాలి- అంటే నొక్కాలి.'చెప్పాను.

'ఆ ఇసయం మాకూ తెలుసండీ.... మేము పల్లెటూరి నుంచి రానేదు. కలకత్తా చూట్ మిల్లులో పని జేస్నా- పదేళ్లు.'


'చూట్ మిల్లా!'

'అదే- జనపనార మిల్లు...' అది సరే శ్రీపతే- మరో సంగతి సెప్పడం మరిసా...' వీడెవడండీ బాబూ- ఒక క్షణం అంతా తెలిసినట్టు మాట్టాడతాడు మరో క్షణం నాతో పోట్లాటకొచ్చినట్టు దబాయిస్తాడు.. ఎప్పుడు కదులుతాడో ఖర్మ... ఏం చేయటానికి తోచలేదు.

'చెప్పండి' అన్నాను కాస్త ఓపిక తెచ్చుకుని.

'నిన్న రేతిరి సంగతి ఇంకా సెప్పనేదు గదూ! కరెంట్ నేదు. ఫూజేదో తెగిపోనాదట- సెప్పింది సీతారత్నం- సెప్పాను గదూ మన పెళ్లాం అని. అది పదో క్లాసు సదివింది గదూ- నులుగు సార్లు తప్పితేనేం, పది ఇంగ్లీసు మాటలు నేర్చుకుంది. అందుకే ఆ ఇసయాలన్నీ మన పెళ్లామే సూసుకుంటాది శ్రీపతే. ఫూజు పోయిందని సెప్పింది కాని దాన్ని అతికి పెట్టడం మన పెళ్లానికి సేతకాదు గదూ...మరి కరెంట్ ఎప్పుడు రావాలా... ఎవురు దీన్ని అతికి పెట్టాల. ఫాను ఆడనేదు. దోమలు గదుల్లో గంతులేత్తున్నాయి. సీతారత్నానికి కంటి మీద కునుకు రానేదు. దానికి నిద్ర నేకపోతే నా మీద కస్సు బుస్సు అని లేత్తాది. నేను గాని మా రాంపండు గాని నోరెత్తడానికి వీల్లేదు.'

''అయ్యా జోగినాథం గారూ, ఈ కాంప్లెక్స్‌లో ఆరు ఫ్లోర్లున్నాయా?''అడిగాను నేను.



''ఉండాయి గదూ! ఉండక యాడికి పోతాయి?''

'ఒక్కో ఫ్లోర్లో ఉన్నవి పది ఫ్లాట్లయితే మొత్తం ఆరు ఫ్లోర్లలో ఉన్న ఫ్లాట్లెన్ని?'

'ఏందయ్యా శ్రీపతే- నువ్వేమనుకుంటున్నావ్ నా గురించి... ఈ జోగినాథం అంటే ఏలాకోలంగా ఉందా! ఈ జోగినాథానికి ఇంగ్లీసు అస్సలు రాదని గదూ నువ్వనుకుంటున్నావ్-ఒకే... అలాగని లెక్కలు కూడా అంతే అనుకుంటున్నావా నీ బండబడా... మనం లెక్కల్లో పస్టు. నీకు తెల్వదు గదూ.. కలకత్తా లోని చూట్ మిల్లు మానేజర్నుడుగు మన సంగతి సెబు తాడు. అక్కడ మనమే మొదలిట్టాం ఒక సిట్టు.'

'సిట్టా!'ఆశ్చర్యంగా అతని మొహంలోకి చూశాను.

'అదేలే శ్రీపతే- నెల నెలా డబ్బుకట్టే చిట్టు పండు... వందలు కాదు వేలు రూపాయిలు సేతిలో గలగలా మనేవి. ఒక్క రూపాయి కూడా తేడా రానేదు. శ్రీపతే, నువ్వు పక్కనుంటానంటే సెప్పు ఈ కాంప్లెక్సులో ఒక సిట్ కంపెనీ నడిపేద్దాం. ఆలోసిం చుకో, తొందర్నేదు.'

'జోగినాథం గారూ- నా విషయం కాస్త ఆలో చించండి. నేను ఆఫీసుకెళ్లాలి.'

'బోల్డు టైముంది గదూ శ్రీపతే- అలా బెంబేలు పడిపోతావేటీ..'

'టైముంది కాని దానికి ముందు ఒక నోటు తయారు చేయాలి జోగినాథం గారూ!'

'నోటా... వెయ్యి రూపాయల్లా నేక ఐదొందల్దా... సెప్పు శ్రీపతే, రమ్మంటే నేనూ వత్తా సేతులు కలపడానికి.'

'మీకు తమాషాగా ఉంది జోగినాథం గారూ- కాని..'

'కానీ లేదు గీనీ లేదు... ంగతేదో తేల్చండి, మా ఫ్లాట్లో కరెంట్ నేదు.'

'అదేగదా మాట్లాడుతున్నా. మీరేమో చిట్‌ఫండ్ కంపెనీ, ఫేక్ నోట్లు అంటూ సంభాషణని డైవర్ట్ చేశారు... ఈ కాంప్లెక్సులో ఉన్నవి అరవై ఫ్లాట్లు. నేను ముందే చెప్పినట్టు దానికో వెల్ ఫేర్ కమిటీ ఉంది. గ్రౌండ్ ఫ్లోర్లో ట్రెజరర్ ఫోర్త్ ఫ్లోర్లో ప్రెసిడెంటు ఉన్నారు. వీరిలో ఎవర్ని కలిసినా ఫర్వాలేదు, మీ పని తొంద రగా అయిపోతుంది.'

'సర్లే నువ్వు సెబుతున్నావ్ గదూ- సెక్రటరీని అడు గుతా గాని, శ్రీపతే గుమ్మం కాడ మనం మాటలు మొద లెట్టామా, మొదలెట్టి పదినిముషాలు జరిగిపోనేదా?'

'అవును, అయింది.'

'పది నిముషాలు నన్ను నిలదీసి మాట్టాడుతు న్నావ్ గందా, నీ పాసుగూలా- లోపలికి పిలిచి, కుర్చీలో కూకోబెడితే నీ సొమ్మేం పోతాదీ అంట. ఆఫీ సులో ఏదో మేనేజర్ గిరీ ఎలగబెడుతున్నావటగా ఆ మాత్రం మర్యాద నీకు తెల్వనేదా అంట.'

వీడెవడండీ బాబూ, జలగలా పట్టుకు వదలటం లేదు.

తెలీక కాదు జోగినాథంగారూ, నేను కొంచం బిజీగా ఉన్నా- అందుకని... '

'అంటే నన్ను నీ గడప బయట నుండే తోలేయా లని సూత్తున్నావా!.. మాకు ఉన్నాయండీ పనులు. కడుపు నిండా మెక్కేసి ఆంబోతులా వీధులంట తిర గటం కాదు మాపని.'

'అయామ్ సారీ అండీ -నా ఉద్దేశం అది కాదు.. రండి, లోపల కూచుని మాట్లాడదాం'అన్నాను.

జోగినాథం మొహంలో ఆనంద రెఖలు చోటు చేసుకున్నాయి. లోపలికొచ్చి సోఫాలో కూర్చున్నాడు.

'బాగుందోయ్ శ్రీపతే- ఇల్లు బాగుంది. ఇంట్లో సామాను బాగుంది. పైన తిరుగుతున్న ఫేను బాగుంది. కింద పరచిన బండలు బెమ్మాండం- అవును గదా అదేటి ఆ మూల కూకున్న పొట్టి మిసను ఇసయం సెప్పకుండా మూతి ముడుచుకు కూకున్నావ్ శ్రీపతే.. '

'అదా- కంపూటర్.'

'అవును గదూ.. ఇప్పుడది లేనిదే పనులు జర గవు గదూ.. దాని వడుపు సూత్తే జానెడు నేదు దీని బండబడా పెపంచంలోని ఇసయాలన్నీ దాని పొట్టలో ఎట్టా బెట్టుకుందంటావ్!... తమాషాగా నేదూ... శ్రీపతే, నీ ఇంట్లో అన్నీ ఉన్నాయి. ఏది అవ సరం ఉన్నా ఇక నాను యాడికి పోను ఈడకే వత్తా... శ్రీపతే, నీకో ఇసయం అడిగినట్టునేదే.. '

'ఏంటది?'

'మన కాంప్లెక్స్ పక్కన పెద్ద స్థలం -అదే, పిల్లకా యలు ఆడుకునే స్థలం ఉంది గదూ...'

'అవును ఉంది. అది మన కాంప్లెక్స్ ప్లే గ్రౌండ్ లోనే ఆడుకుంటారు.'

'అదే శ్రీపతే, ఆ ఇసయమే నానూ సెబుతున్నా... మొన్న సాయంత్రం గంట ఐదుకొట్టలా. అప్పుడు పిల్ల లంతా ఆట మొదలెట్టారా- ఆటలో మీపిల్లకాయ, మాబుల్లోడు నేడా- రాంపండుని గట్టిగా తన్ని కొట్టి కిందకు తోసేసాడట. నేల మీద రాల్లు గాజు పెంకులు మా రాంపండుకి గుచ్చుకున్నాయి. శరీరం నిండా రకతం. మా రాంపండు ఏడుస్తూ మన పెళ్లాం సీతారత్నం దగ్గరకి పరుగెత్తుకుంటూ వచ్చాడా. సీతారత్నం నా కల్లల్లోకి సూసింది ఎర్రగా.. చాతగాని దద్దమ్మవని నన్ను తిట్టింది. అది ఎర్రగా సూస్తే చాలు శ్రీపతే నా కాల్లు వనుకుతాయి, గుండె దడ దడా కొట్టు కుంటుంది. అందుకే నా నోటి మాట రాదు.... ఈ ఇసయం సెప్పడా నికే నానిక్కడికొచ్చాను.'చెప్పాడు జోగినాథం.

నేను నోరు విప్పలేదు. ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాను.

'ఏందలా సూత్తున్నావ్ శ్రీపతే- మింగుడు పడ నేదా... నీకు అబ్బాయి నేడా?'

'లేకేం, ఉన్నాడు.'

'మరేంది , తోలుకురా... '

'నాకొక అబ్బాయి ఉన్న మాట నిజం. కాని వాడు మీ అబ్బాయిని కొట్టలేదు.'

'అట్టాగని నువ్వు సెబితే మేము నమ్మాలా.. '

'మా అబ్బాయి సంగతి నేను చెప్పవ పోతే మరె వరు చెబుతారు?'

'అలాగని నువ్వెట్టా సెప్పగలవ్?'

'ఎట్లాగేంటి, వాడు ఈ ఊళ్లో లేడు..'

'మొన్న సాయంత్రం కూడా నేడా?'

'మొన్నే కాదు- ఒక సంవత్సరం నుండి ఇక్కడ లేడు. వాడు బెగళూరు దగ్గర ఒక రెసిడెన్షియల్ స్కూల్లో చదువుతున్నాడు.'

'మరి ఎవడండీ ఆడు- అట్టా సెప్పిన ఎదవ. సిత్రంగా నేదూ.. అదట్టాగుంచు శ్రీపతే- మీ ఇంట్లో నాను కాలెట్టానా.. అరగంట దాటింది గదూ.. ఒక కప్పుటీ యదవది ఇవ్వాలనిపించనేదా అంట... ఈ కాంప్లెక్స్ యవ్వారమే అదోలా ఉంది గదూ..'

'టీ ఇవ్వాలని తెలీక గాదు- మా ఆవిడ వొళ్లు బాగులేదు.'

నీ పాసుకూలా, ఆవిడకు వొల్లు బాగునేక పోతే నువ్వు లేవా అంట... ఆ స్టవ్వెక్కడుందో సెప్పు నానొక సెయ్యేస్తాను.'

'భలేవారే- మీకాశ్రమెందుకు, నేనే కలిపి తీసుకొ స్తాను.' నేను లేచి వంటింటి వైపు నడిచాను.

'శ్రీపతే, ఇప్పుడు నువ్వు నాకు బాగా నచ్చావ్' గట్టిగా నవ్వాడు జోగినాథం.

అయిదు నిముషాల్లో నేను తెచ్చిన టీ తాగి జోగి నాథం ఖాళీ కప్పును టీ పాయ్ మీద పెట్టాడో లేదో తలుపు తోసుకుని హాల్లోకి వచ్చాడు ఒక కుర్రాడు.

'అయ్యా, అయ్యా- నీ పెళ్లాం పెలుస్తోంది... ఎప్పుడనగా పోయాడు. ఇంకా గూటికి సేరుకోనేదని కల్లెర్ర చేత్తోంది.'చెప్పాడు కుర్రాడు.

'ఈ అబ్బాయి ఎవరండీ?'అడిగాను.

'నా కొడుకు- సెప్పలే 'పేరు రాంపండని.'

'అమ్మ పిలుస్తందని చెప్పక నీ పెళ్లాం పిలుస్తుం దంటాడేవిటి...'

'ఆడలాగే అంటాడు- అంతా అమ్మపోలికే. సరే శ్రీపతే, మల్లీ కలుత్తా. పూజు ఇసయం సెక్రటరీకి సెప్పిసూత్తా...'

తలుపు తీసి అయిదో ఫ్లోర్లోకి దౌడు తీశాడు జోగి నాథం. అతని వెంట పరిగెత్తాడు రాంపండు.

అమ్మయ్య- ఇప్పటికైనా కదిలాడు. పెళ్లాం కబురు రాకపోతే ఇంకా ఎంతసేపు నామెదడు తింటూ కూర్చునేవాడో...

'ఏవండీ- మిమ్మల్నే...లేవండీ... టైం ఆరు దాటింది. ఆఫీసు నోట్ ఏదో పూర్తి కాలేరన్నారు. ఉదయం వేగంగా లేవాలన్నారు...'నా మంచం దగ్గర కొచ్చి లేపింది నీరజ.

'ఏవిటి, నేనింకా నిద్రపోతూనే ఉన్నానా!.. ఆ జోగినాథం ఎక్కడా, ఇంకా వెళ్లలేదా?' అడిగాను నీరజ వైపు తిరిగి.

'జోగినాథం ఎవరు?... అతను వెళ్లడమేవిటి?... మీకేమైనా పిచ్చి పట్టిందా! రాత్రి మీరు వచ్చి మూసిన తలుపులు ఇంకా ఎవరూ తెరవలేదు.'చెప్పింది నీరజ.

అయితే వాడెవడో కలలో నా ప్రాణాలు తోడేసా డన్నమాట! తేంక్ గాడ్.. ఇంకా వాడెవడో అమూల్య మైన నా టైముని వేస్ట్ చేశాడనుకున్నాను.

కాలింగ్ బెల్ గణగణమంటోంది.

'ఏవిటండీ- ఈ రోజు మీకేమైంది?.. బెల్ మోగు తుంటే తలుపు తీయకుండా మంచం మీదే కూర్చు న్నారు.'అడిగింది నీరజ.

'ఆగు నీరజా, ఆగు.. నువ్వు నీ పని చూసుకో, నేను వెళ్లి తలుపు తెరుస్తాను.'

దుప్పటి పక్కకు నెట్టి మంచం దిగాను. హాల్లోకెళ్లి తలుపు తెరవగానే కనబడ్డాడు ఒక మనిషి- పొడవైన విగ్రహం, అంతకు తగినట్టుండే శరీరం, నల్లగా గుబు రుగా ఉన్న మీసాలు, వికృతంగా ఎత్తుగా ఉన్న దంతాలు.. చూడగా ఎవరీ పెద్దాయన అనిపించినా అతని వయసు ముప్పై నలభై మధ్య ఉంటుంది.

'శ్రీపతే... నీ పేరు శ్రీపతే గదూ...'అతని మాటలు చెవిని పడగానే రాత్రి కలలో కనబడ్డ జోగి నాథం గుర్తుకొచ్చాడు. నా నోరు మూగబోయింది. చలనం లేకుండా నిలబడి పోయాను కొన్ని క్షణాలు.

*